క్లుప్తంగా

అంటువ్యాధులపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న వైద్యులు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నగరంలోని టి.చవటపల్లి మండల సమైక్య మహిళా మండలి మీటింగ్‌లో శనివారం అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యులు దిలీప్‌కుమార్ అంటు వ్యాధులపై అవగాహన కల్పించారు. తొలుత అడల్ట్ బీసీజీ వ్యాక్సినేషన్‌పై వివరించారు. అనంతరం కలుషిత నీటి వల్ల కలిగే అనారోగ్య సమస్యలపై ప్రజలకు క్షుణ్ణంగా తెలియజేశారు. కార్యక్రమంలో సీఓ గోపి, సిబ్బంది రేవతి పాల్గొన్నారు.

గురుకులంలో ప్రవేశానికి ఆన్‌లైన్ దరఖాస్తులు

పులిచెర్ల(కల్లూరు): పులిచెర్లలోని మహాత్మా జ్యోతీరావు పూలే సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో 2024–25 సంవత్సరానికి 6,7,8 తరగతిలో ప్రవేశానికి ఆన్‌లైన్ దరఖాస్తులు కోరుతున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ బి.సునీత తెలిపారు. జూన్ 5 నుంచి 15 వరకు దరఖాస్తులు చేసుకోవాలని, అనంతరం 20న రాత పరీక్ష ద్వారా ఎంపిక జరుగుతుందన్నారు. 6వ తరగతిలో 14, 7, 8వ తరగతిలో 10 సీట్లు ఉన్నాయని తెలిపారు.

ఇంటి వద్దకే వైద్యం అందిస్తున్నాం



వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్ సంధ్య

గుడిపాల: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫ్యామిలీ ఫిజిషియన్ కాన్సెప్ట్‌తో ప్రజల ఇంటి వద్దకే వైద్యం వస్తోందని గుడిపాల వైద్యాధికారి సంధ్య అన్నారు. శనివారం బసవాపల్లెలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా గర్భిణులు, బాలింతలు, బీపీ, షుగర్ పేషెంట్లకు పరీక్షలు నిర్వహించారు. మంచానపడ్డ రోగులకు ఇంటువద్దే వెళ్లి పరీక్షలు నిర్వహించారు. వైద్యసిబ్బంది చంద్ర, రోస్‌లిన్, కోమల, పంకజ, నిత్య పాల్గొన్నారు.

పేదలకు మెరుగైన వైద్యసేవలు



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ పూర్ణలత

ఐరాల: గ్రామీణ ప్రాంతాల్లోని పేదలకు ప్రభుత్వం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా మెరుగైన వైద్యసేవలు అందిస్తోందని స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ పూర్ణలత అన్నారు. మండలంలోని పేరయ్యగారిపల్లెలో శనివారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వాహనంలో డాక్టర్ 70 మందికి వైద్యపరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించారు. దీర్ఘకాలిక రోగుల ఇళ్ల వద్దకే వెళ్లి ఆరోగ్య పరిస్థితులు తెలుసుకుని మందులు అందజేసి సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

కల్పవృక్ష వాహనంపై వేణుగోపాలుడు



కార్వేటినగరం: వేణుగోపాలుడు కల్పవృక్ష వాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. బ్రహ్మోత్సవాలలో భాగంగా నాలుగో రోజైన శనివారం ఉదయం స్వామి వారిని సుప్రభాతసేవతో మేల్కొలిపి శుద్ధి, తోమాల, పంచాంగ శ్రవణం నిత్యకైంకర్యాలు నిర్వహించారు. అనంతరం స్వామివారు కల్పవృక్ష వాహనాన్ని అధిరోహించి పురవీధుల్లో విహరిస్తూ, భక్తులచే కర్పూర హారతులను అందుకున్నారు. అనంతరం అర్చకులు వేద మంత్రాలు, మంగళ వాయిద్యాల నడుమ పాలు, పెరుగు, తేనె, పసుపు, చందనం, నారికేళ జలాలతో స్నపన తిరుమంజనం నిర్వహించారు. ధూప, దీప, నైవేద్యాలతో రెండవ గంట నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

సచివాలయం



పచ్చనపల్లె రోడ్డు



చాడేపల్లె-బోయకొండ డబుల్ రోడ్డు



పల్లెకు పట్టం



రైతు భరోసా కేంద్రం

- డీబీటీ, నాన్‌డీబీటీ ద్వారా రూ.15,855 కోట్లు
- విద్యుత్ లబ్ధి రూ.6,389 కోట్లు
- రోడ్లకు రూ.1,762 కోట్లు
- పక్కా భవనాలకు రూ.240.84 కోట్లు ఐదేళ్లలో 45 లక్షల మందికి
- మొత్తం రూ.24,246 కోట్లు ఖర్చు

చిత్తూరు కార్పొరేషన్: పల్లెల అభివృద్ధికి ప్రభుత్వం పట్టం కట్టింది. మౌలిక వసతులతో పాటు అభివృద్ధి చేస్తూ మరో పక్క సంక్షేమ పథకాలను అందిస్తోంది. అద్దె భవనాల్లో కార్యాలయాలకు స్వస్తి తెలిపి పక్కా భవనాలను నిర్మిస్తోంది. వీటితో పాటు రోడ్డు నిర్మాణ పనులు చేపట్టింది. గత ఐదు సంవత్సరాల్లో వేలాది కోట్లు వీటి కోసం ఖర్చు చేసింది. జిల్లాలో మొత్తం 31 మండలాల్లో 697 పంచాయతీలు ఉన్నాయి. పల్లెలు, మండలాల పరిధిలో అభివృద్ధి నినాదంతో ముందుకు పోతున్నాయి. డీబీటీ, నాన్ డీబీటీ కింద అందిన లబ్ధి ఇలా ఉంది.

గ్రామాలకు రూ.కోట్లు

బంగారుపాళ్యం మండలం 1,290 మంది జనాభా ఉన్న మహాసముద్రం గ్రామానికి గత ఐదేళ్లలో రూ.18 కోట్ల వరకు ఖర్చు పెట్టారు. ఇందులో సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వైఎస్సార్ హెల్త్‌క్లినిక్, పక్కాగృహాలు, రోడ్ల నిర్మాణాలతో పాటు సంక్షేమ పథకాలు అయిన చేదోడు, జగనన్న తోడు, విద్యాదీవెన, సున్నావడ్డీ, పింఛన్, రైతు భరోసా, చేయూత, ఆరోగ్యశ్రీ, ఇతర పథకాలకు ఖర్చు చేశారు. ఐదు సంవత్సరాల్లో డీబీటీ, నాన్‌డీబీటీ ద్వారా జిల్లాలోని 40, 80,522 మంది రూ.15,855.98 కోట్లు లబ్ధిపొందారు.

రూ.1762 కోట్లు రోడ్లకు

పంచాయతీరాజ్ పరిధిలో గ్రామాల్లో రహదారులను నిర్మించారు. ఈఏపీ, పీఎంజీఎస్‌వై కింద మొత్తం పల్లెలో కనెక్టివిటీ రోడ్లు 1661 కిలోమీటర్లు నిర్మించగా వాటికి రూ.1,172 కోట్లు ఖర్చు చేశారు. అలాగే ఆర్అండ్‌బీ పరిధిలో 449 కిలోమీటర్లు రోడ్ల మరమ్మతులు, నిర్మాణాలు చేయగా వాటికి రూ.590 కోట్లు వ్యయం చేశారు.

రూ.240.84 కోట్లతో పక్కా భవనాలు

గత పాలనలో ప్రజా సేవలకు పలు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతూ సమయం వృథా అయ్యేది. ఆయా కార్యాలయాలకు తిరగడానికి ఆటోలకు వందలాది రూపాయలు ఖర్చు చేసిన పరిస్థితి. ఇలా కాకుండ స్థానికంగానే పలు శాఖలను సమన్వయం చేసి సచివాలయాలను ఏర్పాటు చేశారు. వీటితో పాటు ఆర్‌బీకే, హెల్త్ సెంటర్లు ఏర్పాటు చేశారు. పల్లె ముంగిట రైతులకు సేవలు ఆర్యోగ సమస్యలను స్థానికంగా చూసుకునే వెసులుబాటు కల్పించారు. పక్కా భవనాల నిర్మాణాల కోసం సచివాలయాల పరంగా 335 నిర్మించగా వాటికి రూ.134 కోట్లు, ఆర్‌బీకేలు 340 కట్టగా రూ.74.12 కోట్లు, హెల్త్ సెంటర్లు 159 నిర్మించగా రూ.32.72 కోట్లు ఖర్చు చేశారు. మొత్తం 834 భవనాలకు రూ.240.84 కోట్లు ఖర్చు చేశారు. మండల, గ్రామాల పరిధిలో అభివృద్ధి, పారిశుధ్య పనులు, వీధి దీపాల నిర్వహణ, నీటి సరఫరా కోసం రూ.93.50 కోట్లు ఖర్చు చేశారు.

విద్యుత్ లబ్ధి రూ.6,389.81

జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, రజక, బార్బర్, ఆక్వా, స్వర్ణకారులు, వ్యవసాయ రంగాలకు ఉచిత విద్యుత్‌ను ప్రభుత్వం అందిస్తోంది. వీటి ద్వారా మొత్తం ఐదేళ్లలో దాదాపు 5 లక్షల మందికి పైగా రూ.6,389.81 కోట్లు సబ్సిడీ రూపంలో అందించారు.

ఉరుములు, మెరుపుల వర్షం



చిత్తూరులో కురుస్తున్న వర్షం

కాణిపాకం: చిత్తూరు, పూతలపట్టు నియోజకవర్గాల్లో శనివారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. తొలుత ఈదురుగాలులతో ప్రారంభమైంది. ఆపై ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడింది. సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 7 గంటలకు వర్షం పడడంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి. అయితే గత మూడు రోజులుగా ఎండలు తారెత్తిస్తున్నాయి. ఉక్కపోతతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఈ వర్షంతో వాతావరణం చల్లబడి ప్రజలకు కాస్త ఉపశమనం లభించింది.

పంచాయతీ కార్యదర్శులకు నోటీసులు

సాక్షి ఎఫెక్ట్..

చిత్తూరు రూరల్(కాణిపాకం): చిత్తూరు మండలంలోని పంచాయతీ కార్యదర్శులకు శనివారం ఎంపీడీఓ సుధాకర్‌రెడ్డి నోటీసులు జారీ చేశారు. సాక్షి దినపత్రికలో పల్లెలపై కాలుష్య పడగ, పొలాలపై కాలుష్యం కాటు అనే పేరిట వార్త కథనం ప్రచురితమైంది. దీనిపై ఎంపీడీఓ స్పందించారు. శుక్రవారం రాత్రి మండలంలోని 17 మంది పంచాయతీ కార్యదర్శులకు నోటీసులు ఇవ్వగా..శనివారం కూడా ముగ్గురు పంచాయతీ కార్యదర్శులకు నోటీసులు జారీ చేశారు. ఈ నోటీసులో ఫ్యాక్టరీలను పరిశీలించడంతో పాటు వ్యర్థాలు, కాలుష్య నివారణ చర్యలు ఏ విధంగా తీసుకున్నారో నివేదికలు సమర్పించాలని కార్యదర్శులకు సూచించారు.

కౌంటింగ్ పకడ్బందీగా నిర్వహించాలి



శిక్షణలో మాట్లాడుతున్న చిత్తూరు అసెంబ్లీ ఆర్‌ఓ శ్రీనివాసులు



హాజరైన అధికారులు, సిబ్బంది

- శిక్షణలో చిత్తూరు అసెంబ్లీ రిటర్నింగ్ అధికారి శ్రీనివాసులు

చిత్తూరు కలెక్టరేట్: ఓట్ల లెక్కింపు ప్రక్రియ పకడ్బందీగా నిర్వహించాలని చిత్తూరు అసెంబ్లీ ఆర్‌ఓ శ్రీనివాసులు అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో ఓట్ల లెక్కింపు ప్రక్రియపై అధికారులు, సిబ్బందికి ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆర్‌ఓలు, అభ్యర్థులు, ఏజెంట్ల సమక్షంలోనే పోస్టల్ బ్యాలెట్ స్ట్రాంగ్ రూమ్స్ తెరవడం జరుగుతుందన్నారు. ఏజెంట్లు తప్పనిసరిగా ఈనెల 4న నిర్దేశించిన సమయానికి కౌంటింగ్ కేంద్రానికి హాజరుకావాలని తెలిపారు. కౌంటింగ్ పూర్తి అయిన తర్వాత ఈవీఎంలను భద్రపరిచేటప్పుడు తప్పనిసరిగా రిజిస్టర్‌లలో వివరాలు నమోదు చేయాలన్నారు. సంబంధిత ఏజెంట్ల నుంచి సంతకాలు తీసుకోవాలని ఆదేశించారు. పోస్టల్ బ్యాలెట్‌ల లెక్కింపులో 13సీ, 13 బీ ని ఏఆర్‌ఓలు, సూపర్ వైజర్లు జాగ్రత్తగా పరిశీలించాలని తెలిపారు. ఏవైన సమస్యలున్నట్లయితే వెంటనే ఆర్‌ఓ దృష్టికి తీసుకెళ్లాలన్నారు. పోస్టల్ బ్యాలెట్‌ల లెక్కింపునకు 14 టేబుల్స్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. 25 ఓట్ల చొప్పున కట్టలు కట్టి ప్రతిటేబుల్‌కు 500 ఓట్లు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈనెల 3న ఉదయం 11 గంటలకు ఎస్వీ సెట్ కౌంటింగ్ సెంటర్‌లో విధులకు కేటాయించిన అధికారులు, సిబ్బంది తప్పనిసరిగా హాజరుకావాలన్నారు. జూన్ 4న కౌంటింగ్ కేంద్రంలోకి సెల్‌ఫోన్‌లను అనుమతించేది లేదని తెలిపారు. కౌంటింగ్ సెంటర్ గేట్ వద్ద ఏర్పాటు చేసిన సెల్‌ఫోన్ కౌంటర్ నందు ఫోన్‌ను డిపాజిట్ చేయాలన్నారు. విధులలో ఎలాంటి అలసత్వం వహించకూడదన్నారు. విధుల పట్ల అలసత్వం వహిస్తే కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు. డీఆర్‌ఓ పుల్లయ్య, ట్రైనీ కలెక్టర్ హిమవంశీ, పలు నియోజకవర్గాల ఆర్‌ఓలు చిన్నయ్య, వెంకటరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, పలు శాఖల జిల్లా అధికారులు మురళికృష్ణ, శ్రీదేవి, రాజ్యలక్ష్మి, నరసింహులు, మూర్తి పాల్గొన్నారు.

వృద్ధులకు తప్పని పింఛన్ కష్టాలు



తగ్గువారిపల్లెలో పింఛన్ ఇచ్చేందుకు ఇంటి వద్ద వృద్ధుడికి ఐరిష్ తీస్తున్న సచివాలయ సిబ్బంది



బంగారుపాళెం: పింఛన్ నగదు కోసం బ్యాంకుకు వచ్చి వెళ్తున్న వృద్ధులు

బంగారుపాళెం: వృద్ధులకు పింఛను కష్టాలు తప్పడం లేదు. ప్రభుత్వం పింఛను నగదు లబ్ధిదారులకు ఆయా బ్యాంకుల ఖాతాలో జమ చేయడంతో పలువురు వృద్ధులు గత నెల లాగానే బ్యాంకుల బాట పట్టారు. శనివారం పలువురు వృద్ధులు దూరాభారం నుంచి అవస్థలు పడి బ్యాంకు వద్దకు వచ్చి పింఛను నగదును తీసుకున్నారు. బ్యాంకులకు వెళ్లి పింఛను తీసుకోలేని వారికి గ్రామ సచివాలయ సిబ్బంది లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి వేలిముద్రలు, ఐరిష్ నమోదు చేసుకుని వారికి పింఛను సొమ్మును అందజేశారు. లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేశారు.

6న మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్షలు

పుంగనూరు: మండలంలోని అడవినాథునికుంట ఏపీ మోడల్ స్కూల్‌లో ఈనెల 6న 7, 8, 9 తరగతులకు ప్రవేశ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ డాక్టర్ రమా తెలిపారు. శనివారం ఆమె మాట్లాడుతూ ఈ ప్రవేశ పరీక్షల కోసం పాఠశాలలో జూన్ 5వ తేదీలోపు నమోదు చేసుకోవాలన్నారు. 6న ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు కామన్ పరీక్ష పేపర్ ద్వారా పరీక్షలు నిర్వహిస్తారన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. జూన్ 8 నుంచి పరీక్షల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులకు మోడల్ స్కూల్‌లో ప్రవేశాలు కల్పిస్తామని తెలిపారు. మరిన్ని వివరాల కోసం మోడల్ పాఠశాలలో సంప్రదించాలని ఆమె కోరారు.

ఘనంగా హనుమాన్ జయంతి

- అర్ధగిరి క్షేత్రంలో ఆంజనేయ సహస్రనామ హోమం

తవణంపల్లె: ప్రముఖ పుణ్యక్షేత్రమైన అర్ధగిరి శ్రీ వీరాంజనేయస్వామి దేవస్థానంలో శనివారం హనుమాన్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ సురేంద్రరెడ్డి, ఆలయ ఈఓ హనుమంతురావు పర్యవేక్షణలో ఉత్సవాలను వైభవంగా నిర్వహించారు. అర్చకులు స్వామికి అభిషేకం చేయించి ప్రత్యేక అలంకరణ చేశారు. అనంతరం ఆలయ ఆవరణలో ఆంజనేయ సహస్రనామ హోమాన్ని భక్తిశ్రద్ధలతో వేదమంత్రాలు పఠిస్తూ నిర్వహించారు. పలువురు భక్తులు స్వామివారికి ఇరుముడులు చెల్లించారు. సాయంత్రం తులసి పుష్పాలచే సహస్రనామ పూజ, రాత్రి ప్రాకారోత్సవం నిర్వహించారు. క్షేత్రంలో రామకోటి భజనలు భక్తులను ఆకట్టుకున్నాయి.

సరకల్లు, ఎగువమత్యం, గాజులపల్లెలో..

మండలంలోని సరకల్లు, ఎగువమత్యం, గాజులపల్లెలో భక్తులు ఆంజనేయస్వామికి అభిషేకం, పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకొన్నారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. సరకల్లులో హరికృష్ణారెడ్డి, స్థానికులు ఆధ్వర్యంలో వరగిరి ఆంజనేయస్వామికి పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఎగువమత్యంలో అభయాంజనేయస్వామికి విశేష పూజలు చేపట్టారు.

చిత్తూరులోని..

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నగరం పొన్నియమ్మగుడివీధిలోని శ్రీ వీరాంజనేయస్వామి దేవస్థానంలో శనివారం హనుమాన్ జయంతిని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.



ప్రత్యేక అలంకరణలో వరగిరి ఆంజనేయస్వామి

కాణిపాకంలో..

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయక స్వామి అనుబంధ ఆలయంలోని శ్రీ వీరాంజనేయ స్వామి ఆలయంలో శనివారం హనుమాన్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఈఓ వెంకటేశు స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు జరిపించారు. ప్రత్యేక ఆకు పూజలు నిర్వహించారు. తదనంతరం స్వామిని విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయం జై హనుమాన్ నామస్మరణతో మార్మోగింది. ఆలయ ఏఈఓ హరిమాధవరెడ్డి, పర్యవేక్షకులు కోదండపాణి, రమేష్ పాల్గొన్నారు.



స్వామి వారిని దర్శించుకుంటున్న భక్తులు

గుడిపాలలో..

గుడిపాల: 197రామాపురంలోని పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వారి మఠం నందు వీరాంజనేయ స్వామి ఆలయంలో శనివారం ఉదయం హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉదయం ఆంజనేయస్వామి సన్నిధిలో స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి దీపారాధన చేశారు. అనంతరం స్వామివారికి పాలాభిషేకం, పంచామృత అభిషేకాలన్నీ జరిపి ఆంజనేయస్వామికి నూతన పట్టువస్త్రాలు సమర్పించారు. ఆపైన స్వామివారికి ఇష్టమైన తమలపాకుల మాల, వివిధ రకాల పుష్పాలతోటి అలంకరించి స్వామివారికి హనుమాన్ చాలీసా పఠనం చదివి వినిపించారు. అనంతరం అష్టోత్తర శతనామవళి కార్యక్రమం జరిగింది.

వేడుకగా ప్రాకారోత్సవం

కాణిపాకం: హనుమాన్ జయంతిని పురస్కరించుకుని కాణిపాకంలో శనివారం రాత్రి పారాకారోత్సవాన్ని వేడుకగా జరిపించారు. ఈ సందర్భంగా స్వామివారిని పలు రకాల పుష్పాలతో సుందరంగా అలంకరించారు. విశేష పూజలు చేశారు. అనంతరం ప్రత్యేక వాహనంపై ఆశీనులు చేసి స్థానిక వీధుల్లో ఊరేగించారు. భక్తులు కర్పూర హారతులు పట్టి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో అధికారులు కోదండపాణి, రమేష్ పాల్గొన్నారు.



రామాపురంలో..



అర్ధగిరిలో స్వాగతతోరణం



అర్ధగిరి క్షేత్రంలో ఆంజనేయ సహస్రనామ హోమం నిర్వహిస్తున్న అర్చకులు



ప్రాకారోత్సవంలో స్వామివారు



స్వామివారికి పట్టువస్త్రాలు తీసుకొస్తున్న ఆలయ అధికారులు